# తోకలోళ్ల ఆంబోతు

డాక్టర్ నక్కా విజయరామరాజు

**వీపు మీద రంగు రంగుల చీరలు, దుప్పట్లు కప్పి మెడలో బంతి పూల దండలు, గంటల శేరు వేసి, మూపురానికి సముద్ర గవ్వల వెంట్రుకల దిష్టితాడు చుట్టి నాలుగు కాళ్ళకు గజ్జెల పట్టీలు, నొసటన పెద్ద కుంకుమ బొట్టు పెట్టి– ఆ బుల్లి ఆంబోతుకు వయస్సుకు మించిన అలంకారం చేశారు. అది గళ్ గళ్ మంటూ నడుస్తుంటే ఎక్కడ లేని ఠీవి వచ్చింది దానికి. దాని పక్కనున్న ఆవు పెయ్యికి దండ లేసి చీరలు కప్పి నొసటన తిలకం దిద్ది పెళ్ళి కూతురులా తయారు చేశారు. జనాన్ని చూసి ఖంగారు పడుతుందది.**



ఆ బుల్లి ఆంబోతు ఉరేగింపు శివాలయం నుండి మొదలైంది. పెద్దారం సొంగయ్య ''ఏరువాక సాగారో అన్నో చిన్నన్నా'' అంటూ క్లార్‌నెట్ మీద పాట వాయిస్తుంటే ఇత్తడి (కిర్‌నెట్) తూరలు ఊదే వాళ్ళు శృతి కలుపుతున్నారు. ఆంధ్రియ్య, బొబ్బిలి వాయించే సైడ్రమ్ము, డ్రమ్ములు గూబ గుయ్... మనిపిస్తున్నాయి. మాదిగ గూడెం నుంచొచ్చిన కుర్రోళ్ళు ఎర్ర షెరాయిల మీద తెల్లటి కట్ బనీన్లు వేసుకుని చిందులు తొక్కుతూ లయబద్ధంగా తప్పెట్లు వాయిస్తుంటే జనం పూనకం వచ్చినట్లు ఊగిపోతున్నారు. ఊరేగింపు రథం సెంటర్‌కు రాగానే బాణా కర్రతో చుట్టూ గిరి గీశాడు మేస్త్రి సూరి. దాని మధ్యలో నిలబడి కనకయ్య ఒక్కడే వాయించిన కనక తప్పెట వరుసలకు చిన్న పెద్ద, పిల్ల జెల్ల అన్న తేడా లేకుండా జనం చిందులేశారు. మంగలి పిచ్చా హరి డోలు, పెద్దబ్బాయి సన్నాయి, పేరయ్య హార్మోణి పెట్టెతో బుల్లి ఆంబోతు పక్క పక్కనే నడుస్తున్నారు. పెద్దారం బండి సుబ్బయ్య బృందం కోలాటం చూడ్డానికి సీతారామయ్య సోడా కొట్టు సెంటర్లో ఆడోళ్ళంతా నిలబడ్డారు. ఊరేగింపు ముందుగా నడుస్తూ గుడ్డి సాంబయ్య, గాలి నీలాంబరం, చాకలి బోల్తాలు కాల్చే పేటేరు టపాకాయలు ఢాం! ఢాం! అంటూ జనం చెవులు చిల్లులు పెడ్తున్నాయి. వేంకటేశ్వర స్వామి పటం పట్టుకున్న తోకల ఎంకటేసు బుల్లి ఆంబోతు పక్కనే నడుస్తూ మధ్య మధ్యలో ''గోవిందా... గోవిందా''! అంటూ జనాన్ని ఉషారు చేస్తున్నాడు.

ఆ ఉరేగింపు చూడ్డానికి ఊరి జనంతో పాటు చుట్టు పక్కల ఇటు పెద్దారం నుంచి దూళిపూడి దాకా. అటు వెల్లటూరు కిందున్న కిష్కంధ పాలెం. దాసరి పాలెం, కోళ్ళ పాలెం చుట్టు పక్కల లంకల జనమంతా వచ్చారు. బుల్లి ఆంబోతును ఆవు పెయ్యని కలిపి చిన్న బజారు, పెద్ద బజారు, గౌండ్ల బజారుతో పాటు ఊర్లోని అన్ని సందులు ఊరేగించారు. వాటికి ఇంటింట కొబ్బరి కాయలు కొట్టి హారతులిచ్చారు ఆడోళ్ళు. చివరిగా కంసాలి సుబ్బాచారి ఇంటి ముందాగింది ఊరేగింపు. స్వస్తిక్ గుర్తు ఇనప ముక్కను కొలిమిలో ఎర్రగా కాల్చి బుల్లి ఆంబోతుకి వీపు మీద అచ్చులా గుద్దాడు సుబ్బాచారి. ''గోవిందా! గోవిందా!!'' అంటూ ఒక్క పెట్టున జనం అరిచేసరికి భయంతో, కాలిన బాధతో బుల్లి ఆంబోతు పైడిమ్మ చెరువు కట్టవైపుకు పరుగు తీసింది.

★ ★ ★

తోకల ఎంకటేసు ఊర్లో తిరుపమెత్తి కాలినడకన తిరుపతి వెళ్ళొచ్చి కోడె దూడను ఆంబోతుగా చేసిన రోజు ఊరికే పెద్ద పండుగ కళ వచ్చింది. ఊరంతా తిరణాళ్ళుగా తయారైంది. ఊర్లో ఇంతకు ముందు మాచర్ల చెంచయ్యగారి పెద్ద ఆంబోతు ఉండేది గానీ అది ముసల్దయి పోయి నడవ లేక కళ్ళు సరిగ్గా కనపడక ఎప్పుడూ శివాలయం ముందు పడుకు నుండేది. ఐదేళ్ళ కిందట దసరా పండగకి అక్కడే చనిపోయిందది. దాని తర్వాత ఊరి మీదికి ఆంబోతునెవరూ వదల్లేదు. ఊర్లోనే కాదు చుట్టు

భట్టిప్రోలు **కథలు**




పక్కల ఊర్లలో ఆంబోతులు లేక ఎదకొచ్చిన ఆవుల్తో అసాములు తెగ ఇబ్బంది పడిపోయే వాళ్ళు. అద్దేపల్లిలో కుంటి ఆంబోతుంది గానీ అది తిని తిరగడమే గానీ, ఆవుకి ఉపయోగపడేది కాదు. ప్రతి ఏటా శివ రాత్రి గోవాడ తిరణాలకి ప్రభకట్టడం కూడా ఆపేశారు ఊరిజనం.

ఆ రోజు ఊరిజనంతో పాటు ఊరేగింపు చూడ్డానికొచ్చిన చుట్టు పక్కల ఊర్ల జనాలక్కూడా లేదనకుండా సుష్టుగా భోజనాలు పెట్టాడు తోకల ఎంకటేసు. ''ఆది కోడె దూడ కాదురా అచ్చంగా కైలాసం నుంచి దిగొచ్చిన నందీశ్వరుడ్రా!'' అని కొంత మంది అంటే ''ఆంబోతును వదిలి ఊరికే కాదు చుట్టు పక్కల ఊర్లక్కూడా చానా మేలు చేశాడ్రా ఎంకటేసని'' ఇంకొంత మంది ''మేకపాలు తాగి బతికింది ఆంబోతవుద్దని ఎప్పుడన్న అనుకున్నామా? అంతా ఆ ఏడుకొండలు వాడి లీల కాకపోతే'' నని ఊరి పూజారి పరబ్రహ్మం చెబుతుంటే కనగాల నుండొచ్చిన జనం ఆశ్చర్యంగా వింటున్నారు. ఇక ఈ ఏడాది నుంచి శివరాత్రికి ప్రభ కట్టొచ్చురా. ఆసాములకు చెప్పండ్రా గిత్తల్ని మేపమని అంటూ ఊరి పెద్ద పర్రే బసవయ్య కుర్రోళ్ళకి చెబుతున్నాడు. ఎంకటేసుకి మాత్రం లంబాడోళ్ళకిచ్చిన మాట దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది!

★ ★ ★

తోకల ఎంకటేసుకి మొడుగు మెట్టన నాలుగెకరాలు, బాడవలో రెండెకరాలు బాగా పండే మాగాణి వుంది. ఎంకటేసుకి ఆయన తండ్రి గోవిందులాగే మొదట్నుంచి భక్తి ఎక్కువే! ఆయన ఏది చేసినా నాలుగు కాలాల పాటు గుర్తుండేటట్టుగా పది మంది చెప్పుకునేటట్లు, ఖర్చుకి వెనకా ముందూ ఆడే వాడు గాదు.

ప్రతి సంవత్సరం ఎండాకాలం పడమట నుంచి లంబాడోళ్ళు ఆవుల మందలు తోలుకుని మా వూరొచ్చే వాళ్ళు రెండు మూడు నెలల పాటు చేలల్లో డేరా లేసుకుని ఉండేవాళ్ళు. ఆవుల్ని పగలల్లా చేల మీద తిప్పుకొచ్చి, రాత్రిళ్ళు ఆసాముల చేలల్లో పేడ కోసం మంద కట్టే వాళ్ళు. ఎకరానికి పది మానికెల వడ్లు ఆవులకి ఎండుగడ్డి ఇచ్చే వాళ్ళు ఆసాములు. ఆ ఏడాది చివరగా తొకల ఎంకటేసు మొడుగు మెట్ట పొలంలో ఆవులు మంద కట్టారు. ఆ రాత్రి ఒక బుర్రనావు కోడెదూడను ఈని మాయ పడక చచ్చి పోయింది. ''తల్లి లేని దాన్ని తీసుకెళ్లి ఏం చేసుకుంటాం? బతికి రంకేస్తే దేవుడి పేరు మీద ఊరు మీద వదులు, లేకపోతే పారేయ్ అని చెప్పి ఆ దూడని తోకల ఎంకటేసు కిచ్చేసి పడమట కెళ్ళి పోయారు లంబాడోళ్ళు. ఆ కోడె దూడని ఇంటికి తెచ్చుకుని 'గోవిందు' అని తన తండ్రి పేరు పెట్టు కున్నాడు ఎంకటేసు. దానికి గేదె పాలు పోస్తే అరగలేదు. ఆవు పాలు పట్టిస్తే పారుకుంది, చివరగా మేకల సొంగమ్మ దగ్గర చెంబుడు మేక పాలు తెచ్చి తాగించాడు. ఆ పాలు తాగి చెంగు చెంగున గంతులేసింది దూడ. ఏకంగా ఆ మేకనే కొనేసి ఇంటి దగ్గర కట్టేశాడు ఎంకటేసు. మేక పొదుగు కుమ్ముతూ అది పాలు



తాగుతుంటే ఊరి జనం వింతగా చూసేవారు. కోడె దూడ మేక కలిసి తిరుగుతుంటే వాటి అనుబంధానికి ఆశ్చర్యపోయారు! దూడను క్షణం వదిలే వాడు కాదు ఎంకటేసు. మట్టి తినకుండా బుల్లి చిక్కాన్ని దాని మూతికి తగిలించాడు. మూన్నెల్లకు పాలు వదిలేసింది దూడ.

★ ★ ★

కోడె దూడకి (బుల్లి ఆంబోతు) తల మీద బుడిపెలు (కొమ్ములు) రాసాగాయి. మోపురం ఉబ్బెత్తుగా కనబడసాగి దూడ అందంగా తయారైంది. దాని మూతి మీద, మూపురం మీదున్న నల్ల మచ్చలు దాని అందాన్ని ఇంకా పెంచాయి. ఆ ఏడాది సంక్రాంతి నెల పట్టిన దగ్గర్నుంచి ఊర్లో తిరగడం మొదలెట్టింది బుల్లి ఆంబోతు. దీపాలు పెట్టే వేళ రథం సెంటరు కోమట్ల ఇళ్ల నుంచి మొదలై సీతా రామయ్య కొట్టు దగ్గర ఆగి పోయేది. ఏ ఇంటి ముందు నిమిషం మించి నిలబడేది కాదు.

ఉడక బెట్టిన ఉలవల బుట్టతో కిరాణా కొట్టు రాములు సిద్ధంగా వుంటే, బియ్యం దుకాణం కోమటి బాపయ్య తౌడు చాట్లో పోసి వుంచేవాడు. కూరగాయలమ్మే గుడ్డినందం సాయంత్రానికి మిగిలి పోయిన వంకాయలు, బీరకాయలు, దోసకాయలు గోతం మీద రాసిగా పోసి ఎదురు చూసే వారు. తౌడైనా, చిట్టయినా, కూరగాయలైనా చివరకు ఉలవ గుగ్గిళ్లైనా సరే ఒక్క నోటెడు మించి తినేది కాదు బుల్లి ఆంబోతు. చివరిగా సీతారామయ్య సోడా కొట్లో బాగా మాగిన చెక్కరకేళీ అరటి పండ్లు తిని ఇంటి దారి పట్టేది.

మాపిటేల కల్లా ఉలవ గుగ్గిళ్ళు బుట్టలో పోసి, అద్దెడు తౌడు రాతి గాబుతో కలిపి కుడితి తయారు చేసి ఆంబోతు కోసం ఎదురు చూసేవాడు ఎంకటేసు. ఏదైన పని బడి ఏ వూరెళ్ళినా మాపిటేల ఆంబోతు వచ్చే వేళకి ఉలవ గుగ్గిళ్ళతో, తౌడు కలిపిన కుడితితో ఇంటి దగ్గర ఎదురు చూసేవాడు.

ఆంబోతు రాగానే ముందుగా ఉలవ గుగ్గిళ్ళ బుట్ట ముందుంచి అది తింటుంటే ప్రేమగా గంగడోలు దువ్వే వాడు. తినడం అయిపోయి కుడితి తాగుతుంటే దాని వీపు మీద గోమార్లు ఏరేసేవాడు. తృప్తిగా కుడితి తాగి రంకెలేసి చావిట్లో పడుకుని నెమరేస్తుంటే మెత్తటి కొబ్బరి పీచుతో దాని ఒళ్ళంతా రుద్దే వాడు. దాని దగ్గరున్నంత సేపు భార్య శకుంతలను గానీ, కూతురు పున్నమ్మని గానీ పట్టించుకునే వాడు గాదు ఎంకటేసు. దోమలు, ఈగలు బాధ లేకుండా చావిడి చుట్టు దోమ తెరలు కట్టుండేవి.

★ ★ ★

బజార్లో ఆంబోతు రంకె వినగానే పిల్లా జెల్లా, ఆడా, మగా అన్న తేడా లేకుండా దాని చుట్టూ మూగి గంగడోలు సవరిస్తూ మూపురం రుద్దుతూ పచ్చ గడ్డి గానీ, కూరగాయలు గానీ దాని నోటి కందించే వాళ్ళు. అంతకు ముందున్న మాచెర్ల చెంచయ్య గారి ఆంబోతు (ఒంగోలు గిత్త) బాగా ఒడ్డూ పొడుగూ వుండి దాన్ని చూస్తేనే దగ్గరకు రావడానికి భయపడేవాళ్ళు. అది ముసల్దయి నడవలేక, రథం సెంటర్లో పడుకున్నా శివాలయం ముందు నిలబడ్డా దాని దరిదాపుల కెళ్ళడానికే భయపడేవాళ్ళు జనం. ఒక్కరోజు ఊరిజనానికి చిన్న ఆంబోతు కనబడక పోతే ఏమీ తోచేది కాదు. దీపాలు పెట్టే వేళకు గానీ అది రాకపోతే శివాలయం వీధి వైపో రథం సెంటర్ వైపో చూసే వాళ్ళు. కొంత మంది కోమట్ల ఆడోళ్ళు ఆంబోతు కనబడక పోతే దీపాలు ముట్టించే వాళ్లు కాదు. చిన్న ఆంబోతు ఊర్లో ఇంటి మనిషై పోయింది. దాన్ని అందరూ తోకలోళ్ళ ఆంబోతనే పిలవ సాగారు.


శివరాత్రికి ఊరిజనమంతా కలిసి ప్రభ కట్టి గోవాడ కోటయ్య గుడికి తీసుకెళ్ళి గుడి చుట్టూ తిప్పి ఆ రాత్రి వుండి తెల్లారి తిరిగిరావడం ఎప్పట్నించో ఊర్లో ఉన్న ఆచారం. శివరాత్రిని గోవాడ తిరణాల పండుగని చాలా గొప్పగా చేసేవాళ్ళు.

ప్రభలు, రికార్డింగ్ డాన్సులు, సర్కస్‌లు, కంచర సామానుల దుకాణాలు, ఆటబొమ్మల దుకాణాలు, అరటి పండ్లు, చెరకు గడలు, కొబ్బరి కాయల దుకాణాల్లో ఆ వారం రోజుల పాటు గోవాడ కోటయ్య గుడి తిరణాలగా వుండేది. శివరాత్రి రోజు ఊరి కొక్క ప్రభ చొప్పున గోవాడ చేరుకునేవి. ప్రభల దగ్గర పిల్లలు పుట్టని జంటలు, పెళ్ళి కాని ఆడోళ్లు మొక్కుకునే వాళ్ళు. పది బిందెల నీళ్ళు పైన పోసుకుని ప్రభ ముందు పాట సారం పాడే వాళ్ళు. ప్రభని లాగడానికి ఏడాదినుంచి కాడి మోపని కోడె గిత్తలను తౌడు, చిట్టు, గుగ్గిళ్ళు జనపకట్టె లాంటి దాణా పెట్టి ప్రత్యేకంగా మేపే వాళ్ళు. ఒక ఏడాది అత్తలూరి గోపాలరావు గారి ఒంగోలు గిత్తల్ని ప్రభకు కడితే ఇంకో ఏడాది పెద్దారం బండి సుబ్బారావు మైసూరు గిత్తల్ని కట్టే వాళ్ళు. ప్రభ బయలుదేరి గోవాడ వెళ్తుంటే ప్రభని, దానికి కట్టిన కోడె గిత్తల్ని చూడ్డానికి కనగాల నుండి, గూడవల్లి, పొన్నపల్లి, గుల్లపల్లి, చెరుకు పల్లె దాక జనం రోడ్డు పక్కన బారులు తీరేవాళ్ళు.

ఆ ఏడాది రంగు రంగుల కాగితాలతో కరెంట్ బల్బులతో బూజిక్ బుట్టలో తాడి చెట్టంత ప్రభని అందంగా అలంకరించారు. ప్రభని లాగడానికి అత్తలూరి గోపాలరావు గారి ఒంగోలు గిత్తల్ని ఆయన పెద్ద జీతగాళ్ళు బండోడు, బక్కోడు తోలు కొచ్చారు. అవి బుసలు కొడుతూ, రంకెలేస్తూ మిసమిసలాడుతున్నాయి. కోమటి రంగయ్య ఇంటి ముందు వరి చెత్త మంటతో తప్పెట్లు కాక పెట్టు కుంటున్నారు కనకయ్య బృందం. సొంగయ్య బ్యాండు మేళం ట్రూపు క్లార్‌నెట్, కిర్‌నెట్‌లు శృతి చేసుకుంటున్నారు. మైకులో పాటలు వెయ్యడానికి మంచి మంచి రికార్డులు ఏరి పక్కన పెడుతున్నాడు పసి. ఆడోళ్ళంతా బిందెలు, కడవలతో నీళ్ళు నింపి సిద్ధంగా ఉన్నారు.

రికార్డింగ్ డాన్సులు తొక్కడానికి తెనాలి సాలిపేటనుంచొచ్చిన డాన్సు పార్టీ సీతారామయ్య గారింట్లో మేకప్పు వేసుకొంటున్నారు. ప్రభకు కట్టిన మోకులు పట్టుకునే కుర్రోళ్ళంతా అసహనంగా చూస్తున్నారు. ఛైర్మన్ జొన్నదుల వెంకటేశ్వర్లు, ప్రెసిడెంట్ మాచెర్ల సీతారామయ్య, షావుకారు పిచ్చయ్య, అత్తలూరి గోపాలరావుగారు, మునసబు మాచర్ల పెద్దాసు, అత్తలూరి పిచ్చయ్య, కరణంగారు అనగాని పంతులు, పర్రె బసవయ్య, నక్కసూరి నారాయణ, సలగాల దుర్గయ్యతో సహా ఊరి పెద్ద మనుష్యులంతా వచ్చేశారు. పూజారి రాంబ్రహ్మం ప్రభ పక్కనే నిలబడి ఎదురు చూస్తున్నాడు. ''ఇప్పటికే పొద్దు పడమటికి వాలింది గందా... ఇంకా ఆలీస్యం అయితే అక్కడ చెరుకుపల్లి సెంటర్లో ఊర్లనుంచొచ్చే ప్రభలు ఎక్కువై ఈ ప్రభకు చోటు దొరకదు కదా! ఊరి పెద్ద మనుష్యులంతా వచ్చినట్టున్నారు. ఇంకా ఎవరి కోసం ఆగారండీ?!'' అంటూ పెసర్లంక నుంచొచ్చిన మనిషి కౌతరపు ఆంజనేయులును అడుగుతున్నాడు. ''ఏ వూరు తమరిది? మా వూరులా లేదే?'' అన్నాడు ఆంజనేయులు; ''మీ వూరి ప్రభని చూసి, గోవాడ తిరుణాల పోదామని పెసర్లంక నుంచి ఓ పది మందిమి వచ్చాము లేండీ,'' అని చెప్పాడాయన.

''పెసర్లంకా! అట్టా చెప్పు! మా వూరి ఆచారం తమరికి తెలీదు గామోసు. ఊరి పెద్దలెంత మంది వచ్చినా, ఊరి ఆంబోతు వచ్చినాక ప్రభను కట్టిన బండి కాడి దాని మెడ మీద ఆనిస్తే గానీ ప్రభ బయలు దేరదు. అట్టా జరిగితే ప్రభకు ఏ ప్రమాదం జరుగదని, నందీశ్వరుడే సాయంగా గోవాడ వచ్చినట్టు అనుకుంటాడు. ఆ కోటయ్య సామి.'' అని ఆంజనేయులు చెబుతుండగా తోకల ఎంకటేసు ఆంబోతుతో అక్కడి కొచ్చాడు. ఒక్కసారిగా జనంలో ఉషారొచ్చింది. ప్రభ కట్టిన బండి కాడిని ఆంబోతు మెడ మీద ఉంచి తీశాడు తోకల ఎంకటేసు. వీర బ్రహ్మం కొబ్బరికాయలు కొట్టి హారతిచ్చాడు. ఆడోళ్ళంతా ఆంబోతుకు దండాలు పెట్టుకుని హారతిని కళ్ళకద్దుకున్నారు. ''హర హర మహాదేవ శంభో... ఈ ఏటికిద్దరు... వచ్చే ఏటికి ముగ్గురు... చేదుకో కోటయ్యా, చెరుకు దంటుల కోటయ్య,'' అంటూ పూజారి మైకులో చెప్పగానే తప్పెట్లు, బ్యాండ్ మేళం, సన్నాయి డోలు ఒక్కసారిగా మారు మ్రోగాయి. ప్రభకు గిత్తల్ని కట్టి చెరొక పక్క నిలబడ్డారు బండోడు, బక్కోడు. ఆడోళ్ళంతా ప్రభ ముందు నీళ్ళు పోసి పాట సారం పడ్డారు. ''హర హర మహ దేవరా శంభో'' అంటూ



# కెరీర్ బాగుంది...!!

పాండురంగడితో అర్చన దశ తిరిగినట్లుంది. అంతకు ముందు చిన్నా చితకా పాత్రలు చేసినా.... పాండురంగడితో అర్చన కెరీర్ గ్రాఫ్ పరుగులు పెడుతోంది. ఆ సినిమా తరువాత త్వరలో షూటింగ్ ప్రారంభంకానున్న రెండు తెలుగు చిత్రాలకు సైన్ చేసింది. ఈ రెండింటిని పేరున్న దర్శకులు దర్శకత్వం వహిస్తున్నారు. మరో కన్నడ చిత్రానికి అంగీకరించింది. ప్రారంభంలో నేను చేసిన చిన్న చిన్న తప్పులే హీరోయిన్ రేస్‌లో నన్ను కొద్దిగా వెనక పడేశాయి. ఇక ముందు అలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్త పడుతున్నాను అని అర్చన చెబుతోంది. సినిమాలంటే ఎంత ఇష్టమో డాన్స్ అన్నా నాకు అంతే ప్రాణం. షూటింగ్ బిజీలో పడి డ్యాన్స్ పక్కన పెట్టాను. ఇక నుంచి స్టేజ్ షోలకి కూడా తగిన ప్రాధాన్యత నివ్వాలని నిర్ణయించుకున్నాను. వీలున్నప్పుడల్లా డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు చేస్తాను. త్వరలో హైదరాబాద్ నగరంలో ఇలాంటి ప్రోగ్రామ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నట్లు అర్చన చెబుతోంది. షూటింగ్‌లు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లతో తన షెడ్యూల్ అంతా ఇక బిజి బిజీ అంటోంది. బెస్టాఫ్ లక్ అర్చనా...



ప్రభ బయలు దేరింది. ప్రభ ఊరు దాటే దాకా ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. ఆంబోతు ప్రభ ముందు నడుస్తూ షావుకారి పిచ్చయ్య గారి ఇంటి దాక వచ్చి ఆగి పోయింది. తోకల ఎంకటేసు ప్రభ వెంట గోవాడ కెళ్ళి పోయాడు. ముసలి, ముతక తప్ప ఊరి జనమంతా గోవాడ తిరుణాల కెళ్ళి పోయారు.

★ ★ ★

రోజల్లా ఎక్కడ తిరిగినా సాయంత్రాని కల్లా ఇంటికి జేరే ఆంబోతు ఎంకటేసు ఇంటికొచ్చింది. గాబులో కుడితె లేదు. పెద్దగా రంకె వేసినా ఎంకటేసు భార్య శకుంతల బయటకు రాలేదు. ఇంకోసారి రంకె వేసి చావిట్లో కైనా పోకుండా రథం సెంటర్ కెళ్ళిపోయింది. ఆంబోతు ఆ రాత్రంతా శివాలయం ముందు పడుకుంది. ఆ మరుసటి రోజు గోవాడ నుంచి తిరిగొచ్చిన ఎంకటేసు ఉలవలు ఉడక బెట్టి ఆంబోతు కోసం ఎదురు చూశాడు. దీపాలు పెట్టి గంటయినా ఆంబోతు రాలేదు. ఆంబోతు కోసం రథం సెంటరు, శివాలయం, మాచెర్ల చెరువు, కట్టి గౌండ్ల బజారుతో పాటు ఊరంతా వెదికాడు. ఎక్కడా కనబడలేదు. ఆంబోతు గురించి కనబడ్డ మనిషినల్లా అడిగాడు. ''పొద్దున్నుంచి పైడిమ్మ చెరువు కట్ట మీద గుడి ముందు పడుకుంది మామా ఆంబోతు'' అని చెప్పాడు సాకల పోతురాజు. పరుగు పరుగున వెళ్ళి ఆంబోతును ఇంటికి తోలుకొచ్చాడు ఎంకటేసు. రెండు బుట్టల ఉలవల రెండు గాబుల కుడితి తాగింది.

దాని ఆకలి చూసి ''నిన్న ఆంబోతుకి కుడితి పెట్టలేదా?'' అనడిగాడు శకుంతలను. ఆమె కూతురు పున్నమ్మకి అన్నం పెడుతుంది. ''కుడితే కాదు... గుగ్గిళ్ళు కూడా పెట్టలేదు తిని ఊరు మీద తిరిగే దాని వల్ల అణా కాని లాభం లేదు. అయిన గోతాలు గోతాలు చిట్టు, తవుడు ఏడ్నుంచొత్తందని... ఇట్టా ఇల్లంతా గుల్ల చేసి పారేత్తే నేను నా కూతురేంగాను? దీన్ని రేపు ఏ అయ్య చేతిలో పెట్టాలన్న మన చేతిలో ఏగానన్నా ఉండొద్దు'' అంటూ గయ్ మని ఎంకటేసు మీద లేచింది భార్య. ''అంటే నిన్నట్నుంచి కుడితి కూడా తాగలేదన్నమాట నా గోవిందు,'' అంటూ కోపంతో ఊగిపోతూ, ''ఛీ నువ్వు మనిషివేనా? నోరు లేని దాని కడుపు మాడుస్తావా?'' అంటూ చెడా మడా తిట్టాడు. ఆ రోజు నుంచి ఆంబోతు మీద ద్వేషం పెంచుకుంది శకుంతల. వారం రోజుల తర్వాత పని బడి పెద్దారం పోయాడు ఎంకటేసు. ఆ రాత్రి చావిట్లో పడుకున్న ఆంబోతును బాగా కాల్చిన అట్ల కాడతో వాతలు పెట్టింది శకుంతల. ఊర్నుంచి తిరిగొచ్చి ఆంబోతును చూసి పిచ్చి కోపం వచ్చింది ఎంకటేసుకి. అప్పుడు పెద్ద గొడవే అయింది. శకుంతల అలిగి పుట్టింటికి తురకపాలెం వెళ్ళిపోయింది. పుండ్ల మీద ఈగలు వాలకుండా నూనె రాస్తూ ఆంబోతు వెంట నెల రోజులు పైగా తిరిగాడు ఎంకటేసు. ఆంబోతు పుండ్లు పొక్కు కట్టి పూర్తిగా మానిన తర్వాత గానీ ఆయన మనసు కుదుట పడలేదు.

మూడు నెలల తర్వాత చుట్టు ప్రక్కల ఇళ్ళ వాళ్ళ ఒత్తిడి తట్టుకోలేక శకుంతలని తీసుకురావడానికి తురకపాలెం వెళ్ళాడు ఎంకటేసు. ''ఆంబోతును తరిమేస్తేనే వస్తా! అదక్కడవుంటే ఆ వూరు రాను! అది కావాలో నేను కావాలో తేల్చుకో''మని కరాఖండిగా చెప్పింది శకుంతల. ''అయితే నువ్విక్కడే వుండంటూ'' మారు మాటాడకుండా తిరిగొచ్చాడు ఎంకటేసు.

ఆ తర్వాత ఆంబోతే లోకమై పోయింది ఎంకటేసుకి. ఆ రెండు సంవత్సరాలు వానలు పడక, పంటలు సరిగా పండలేదు. ఆంబోతుకు దాణా కూడా కష్టంగా ఉంది. గోరు చుట్టు మీద రోకటిపోటులాగా ఆ ఏడాది దివిసీమ తుఫాను వచ్చి చేలన్నీ బీడులయిపోయాయి. ఆ తర్వాత రెండేళ్ళ పాటు చేలలో అరక కట్టిన రైతే లేడు. మోకాలు లోతు తుంగ గడ్డి పెరిగి అది దున్నాలంటే నాగళ్ళ కొర్రులు విరిగిపోతున్నాయి. వాటికి మెట్ట చేలు దున్నే మహింద్రా ట్రాక్టర్లు కావలసి వచ్చినయి. ఓపిక వున్న రైతులు అప్పో సొప్పో చేసి మళ్ళీ వ్యవసాయానికి తెగబడ్డారు. చిన్న సన్నకారు రైతులు చితికి పోయారు. నష్ట పరిహారం ఎకరానికింతిస్తానన్న గవర్నమెంట్ పైసా విదిల్చిందిలేదు. ఆంబోతు దగ్గర కూర్చుని ఎండు గడ్డి పెడుతూ తన బాధలన్నీ చెప్పుకునే వాడు ఎంకటేసు. దాణా, తౌడుతో కలిపిన కుడితి పోయలేక పోయినందుకు కుమిలిపోయాడు. పోనీ కొంత పొలం అమ్ముదామనుకున్నా దాన్ని కొనే నాథుడే లేడు. అమ్మ బోతే

అడివి కొనబోతే కొరవిలా తయారయ్యింది ఊరు. ఇంట్లో వస్తువులకు ఎప్పుడో రెక్కలొచ్చినాయి. వేళకి తిండి లేక సగమై పోయాడు ఎంకటేసు.

★ ★ ★

దసరా పండక్కి ప్రతి ఏడాది రైసు మిల్లు ముందు పందిరేసి విగ్రహం పెట్టి నవరాత్రి ఉత్సవాలు జరిపించేవాడు ఊరి మునసబు అత్తులూరి పిచ్చయ్యగారు. హరికథో, బుర్రకథో, నాటకమో రోజూ ఏదో ఒక కార్యక్రమం ఉండేది. ఆ రోజు బ్రహ్మంగారి నాటకం చూసి ఇంటికొచ్చిన ఎంకటేసు ఆ రాత్రి చావిట్లో ఆంబోతు పక్కనే మంచం వేసుకుని పడుకున్నాడు. నిద్దట్లోనే చనిపోయాడు. ఊరి జనమంతా వచ్చారు. శకుంతల కోసం తురక పాలెం మనుష్యులు పోతే ఆ రాత్రికి వచ్చిందామె. రెండో రోజు సమాధి చేశారు. ఆ రెండ్రోజులు ఎంకటేసు శవం దగ్గరే ఉంది ఆంబోతు. గడ్డి పరక కొరక లేదు. గుక్కెడు కుడితి తాగలేదు.

పెద్ద కర్మ రోజున బుసలు కొడుతూ రంకెలేస్తూ ఇంటికొచ్చింది ఆంబోతు. బుసలు కొడుతూ, ముందు కాలు నేల మీద గీస్తూ, తోకను నాగుపాము లాగా లేపి, రంకెలేస్తుంటే పిడుగుల పడ్డట్టు దద్దరిల్లి పోయింది. దాని ఉగ్ర రూపం చూసి దగ్గరకు రావడానికి భయపడ్డారు జనం. నీళ్ళ దొడ్డిని పడదోసింది. గొడ్ల చావిడిని కూల దోసింది. ఇంటి ముందున్న వేప చెట్టుని పెరికేసింది. దండెం మీద ఆరేసిన శకుంతల చీరను పీలికలుగా కొమ్ముల్తో చీరేసింది. గాడిపొయ్యి మీద ఉడుకుతున్న వంట పాత్రల్ని కుమ్మి చిందర వందర చేసింది.

రాతి గాబుల్ని కొమ్ముల్తో కుమ్మి పగల కొట్టింది. దాన్ని అదుపు చేయడం ఎవరి తరం కాలేదు. పది మంది కుర్రోళ్ళు సాగ నార పగ్గాలు, కర్రలు తెచ్చారు. ఆంబోతుని పట్టి కట్టేద్దామని. ''ఎంకటేసు సచ్చిపోయాడని దిగులేసుకుందేమో లేరా, దాన్నేమీ అనకండి; అది మనూరి నందీశ్వరుడు. రెండ్రోజులు పోతే అదే సర్దుకుంటదిలే'' అని కుర్రోళ్ళకు సర్ది చెప్పాడు తోకల లక్ష్మయ్య. తోకల ఎంకటేసు సమాధి తోకలోల్ల దిబ్బమీదే, ఆయన తండ్రి గోవిందు సమాధి పక్కనే కట్టారు. ఆరోజు నుంచీ ఆంబోతు ఊర్లో సరిగ్గా కనబడ్డం లేదు. ఆడోళ్ళు ఎవరు కనబడ్డా బుసలు కొడుతూ రంకెలేస్తూ కుమ్మడానికి పైకొచ్చేది. దొరికిన ఆడోళ్ళను పొడిచేది. ఆంబోతు బజార్లో ఉంటే బయటకు రావడానికి ఆడోళ్ళు భయపడసాగారు. ఎడ్ల బండ్లను అటకాయించేది. ఊరి దగ్గరున్న చేలలో పడి పంటలు కసాబిసా తొక్కి పారేసేది. ఊర్లోనే కాదు, చుట్టు ప్రక్కల ఎడ్ల బండ్లతో రావాలంటే భయపడే వాళ్ళు రైతులు. తోకలోళ్ళ ఆంబోతు పెద్దారం రోడ్డులో వుంటే కనగాల మీదగానో, పాలెం రోడ్డులో వుంటే ధూళిపూడి డొంక గుండానో పోయేవాళ్ళు. ఎండాకాలం మట్టి పనులప్పుడు మరీ కష్టమై పోయేది. రాత్రుళ్ళు ఇళ్ళ ముందు మంచాలు వేసుకోవడం మానేశారు జనం దాని దెబ్బకి. పొలాల్లో ఏ ఎద్దు కనబడినా తరిమి తరిమి పొడిచేది. రోజల్లా ఎక్కడ తిరిగినా రాత్రికి తోకలోల్ల దిబ్బ మీదున్న ఎంకటేసు సమాధి దగ్గరకొచ్చి పడుకునేది.

ఎంకటేసు చనిపోయి మూడేళ్ళయినా ఆంబోతు పరిస్థితి అలాగే వుంది. దాని మొఖిరి పనులకు ఊరి జనమే కాదు చుట్టు ప్రక్కల ఊర్ల జనం కూడా విసిగిపోయారు. ఆ మూడు సంవత్సరాలు ఊర్లో ప్రభ కట్టలేదు. ఆ ఏడాది సంక్రాంతి పండక్కి ఊరొచ్చిన శకుంతల, మొగుడు మెట్టలో మిగిలిన రెండెకరాలు అమ్మేసుకుంది. ఆ ఏడాది సంక్రాంతికి గంగిరెద్దులోళ్ళు ఆటకట్టడానికి మా వూరొస్తే వాళ్ళతో మాట్టాడి వాళ్ళకు బస్తా వడ్లిచ్చి ఆంబోతును తీసుకు పొమ్మంది. ఆంబోతును పట్టి తీసుకెళ్ళడానికి పగ్గాలు చాలక మోకులు తేవాల్సి వచ్చింది. ఇరవైమంది కుర్రాళ్ళక్కూడా అలివి కాలేదది. ఎలాగైతేనేమి పట్టుకుని ముక్కుతాడేసేశారు. ఆంబోతుని తీసుకెళ్ళొద్దని కొంతమంది పెద్ద మనుష్యులు అడ్డం పడ్డారు. ''దీని మొఖిరి తనం వదిలించి మళ్ళీ తీసుకొచ్చి మీకు అప్ప చెప్పుతా''మని నమ్మబలికి అనగాని వెంకటేశ్వర్లు పంతులుగారి సమక్షంలో అలా అని స్టాంపు పేపర్ మీద రాసిచ్చారు గంగిరెద్దోళ్ళు. ఆంబోతు పోగానే ఊరి జనమంతా ఊపిరి పీల్చుకున్నారు. అంత మంచి ఆంబోతు అంత మొఖిరిగా ఎందుకయ్యిందని చాలాకాలం చెప్పుకున్నారు ఊరి జనం. ప్రతి సంక్రాంతికి గంగిరెద్దోళ్ళు వస్తారని, ఆంబోతును అప్ప జెబుతారని ఎదురు చూడసాగారు ఊరి జనం.

సంక్రాంతి నెల పట్టారు. చలి కొంచెం ఎక్కువగానే ఉంది. ఇంటి ముందు వరి గడ్డితో చలి మంట లేసుకుంటున్నారు జనం. ఇద్దరు మనుష్యులు డోలు వాయిస్తూ ''ఈ రోజు రాత్రి ఏడుగంటలకు రథం సెంటర్లో గంగిరెద్దులతో 'సీతారామ కళ్యాణం' బ్రహ్మాండమైన ఆట. అందరూ తప్పకుండా రావాలి! ఆ ఆట ఆడే గంగిరెద్దు రెండేళ్ళ క్రిందట మీ వూరు నుంచి తోలుకెళ్ళిన నల్ల మూతి నల్ల మూపురం వున్న తోకలోల్ల ఆంబోతు. తప్పకుండా రావాలి,'' అంటూ డోలు వాయిస్తూ ఊరంతా తిరిగి దండోరా వేశారు.

''తోకలోళ్ళ ఆంబోతా? మనూరి ఆంబోతా? దాన్ని నిజంగా గంగిరెద్దులా చేశారా? అంత మొండి దాన్ని ఎట్టా మాలిమి చేశారబ్బా?'' అని కొంత మంది ''అది మేక పాలు తాగినప్పటినుంచి చూశాం, ఇప్పుడెట్టా ఉందో చూద్దా''మని ఇంకొంత మంది– ఊరంతా పిల్లా పెద్దా వచ్చారు. ఇసకేస్తే రాలనట్టు జనంతో రథం సెంటర్ కిట కిటలాడిపోయింది తోకలోళ్ళ ఆంబోతును చూద్దామని. గంగిరెద్దు లోళ్ళు పదిమంది దాక ఉన్నారు. ఇద్దరు బలమైన మనుషులు ముక్కు తాడేసిన గంగిరెద్దుని పట్టుకుని చెరొక ప్రక్కన నిలబడ్డారు. రంగు రంగుల బట్టలు కప్పి అందంగా తయారు చేశారు. దాని మూపురం కనబడకుండా రంగుల గుడ్డలు చుట్టారు. నాలుగు కాళ్ళకు గజ్జెలు, మెడలో గంటలు కట్టారు. ఆంబోతు మునుపటిలా లేదు. అప్పటి దర్జా, ఠీవి ఏ కోశానా లేవు. దాని జవ జీవాలు కుంగ గొట్టినట్టున్నారు. కుక్క పిల్ల లాగ ఆ మనిషి ఏది చెబితే అది చేస్తోంది. తలాడించమంటే తలాడిస్తూంది. మోకాలు తండ వెయ్యమంటే వేస్తూంది. పడుకోమంటే పడుకొని లేవమంటే లేచింది. ఆ గంగిరెద్దాయన ఛాతీ మీద రెండు కాళ్ళు పెట్టి వాళ్ళు వాయించే సన్నాయి పాటకు, డోలు శబ్దానికి అనుగుణంగా ఊగుతూ పాటయిపోగానే సున్నితంగా దిగింది. ఆట చివరగా 'సీతారాముల కళ్యాణం'. రాముడు గంగిరెద్దు, సీతగా ఒక తెల్ల ఆవుని తెచ్చారు. సీతరాముల్లాగా వాటికి పెళ్ళి చేశారు. హారతిచ్చారు. రథం సెంటర్ నుంచి శివాలయం దాకా అక్కడ్నించి సీతారామయ్య సోడా కొట్టు దాక ఊరేగించారు. ఆటలో ఆటగా గంగిరెద్దు పగ్గాలు వదిలేశారు. అది అక్కడ తీసిన దౌడు చిన్న బజార్, పెద్ద బజార్ దాటి ఎటుపోతుందో తెలీకుండా ఊర్లోని సందుగొందులన్నీ తిరిగింది. చివరగా ఊరి బయటకి దౌడు తీసింది. దాన్ని పట్టుకునేందుకు గంగిరెద్దోళ్ళతో పాటు ఊరి కుర్రోళ్ళు కూడా వెంట పడ్డారు. దాని ఒంటి మీదున్న బట్టలు, గంటలు, గజ్జెలు రోడ్డు ప్రక్కన జారిపడిపోయాయి. ఆ రాత్రంతా వెదికినా ఎక్కడా కనబడలేదు గంగిరెద్దు.

తూర్పు తెల్లారుతుండగా యానాది సంజీవిని తీసుకుని తోకలోళ్ళ దిబ్బ మీదు కెల్లాడు పర్రె చంద్రయ్య. ఆయన కుడి చేతిలో గరుడ రేఖుందని చెయ్యి చాపితే ఎంతటి పామయినా నిలబడుద్దని అనుకునే వాళ్ళు. వారిద్దరూ దిబ్బ మీదున్న తాచుపామును పట్టడానికి ఎంకటేసు సమాధి పక్కనున్న పుట్ట దగ్గరికి వస్తుంటే ఎంకటేసు గోవిందు సమాధుల మధ్యన పడుకున్న తోకలోళ్ళ ఆంబోతు కనబడింది. దాని ఒంటి మీద గంగి రెద్దులోళ్ళు కప్పిన గుడ్డలుగానీ, గంటలు గానీ ఏమీ లేవు. దగ్గర కెళ్ళి చూస్తే నిద్దర పోతున్నట్టే వుంది. దీన్ని ఊర్లోనే ఉంచుకుందాం ఆ గంగిరెద్దోళ్ళకు ఎంతో కొంత ముట్ట జెప్పి, అనుకుంటూ దాన్ని కదిలిస్తే అది కదలలేదు. బిర్రగా బిగదీసుకుపోయింది. రాత్రి ఎప్పుడో చచ్చిపోయి నట్టుంది. ఆ వార్త తెలిసిన క్షణాల్లో ఊరిజనమంతా అక్కడ మూగారు. ఆంబోతును చూసి బాధ పడ్డారు. ఆడోళ్ళంతా ఏడ్చారు. గొయ్యి తవ్వి ఆ దిబ్బ మీదే ఎంకటేసు సమాధి ప్రక్కనే పాతి పెట్టారు తోకలోళ్ళ ఆంబోతును.

★ ★ ★

ఆ తర్వాత ఊరి మీదకి ఎవ్వరు ఆంబోతును వదల్లేదు.

★